ప్రజాశక్తి

సోమవారం 11 నవంబర్ 2024

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

హాస్టళ్లలో ఆకలి కేకలు

- ఆరు నెలలుగా నిలిచిన డైట్ ఛార్జీలు
- అప్పుల ఊబిలో వార్డెన్లు
- విద్యార్థుల మెనూ అమలుపై ప్రభావం

పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం... వారి విద్యాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాం... వారికోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తాం... మీరు చేయాల్సిందిల్లా ఒక్కటే.. మీ పిల్లలను సంక్షేమ వసతి గృహాల్లో చేర్పించండి.. అంతా ప్రభుత్వమే చూసుకుంటుందని పాలకులు గొప్పలు చెబుతుంటారు. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి ఆ మాటలు ఒట్టి నీటిమూటలుగా మిగిలాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. పేద విద్యార్థులకు సకాలంలో అందించాల్సిన భోజనం విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఆకలి కేకలు తప్పడంలేదు.

ప్రజాశక్తి–కలెక్టరేట్ (కృష్ణా)

ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి... మరో వైపు ఆరు నెలలుగా వసతి గృహ విద్యార్థుల డైట్ ఛార్జీలు విడుదల కాలేదు... ఈ నేపథ్యంలో వసతి గృహ విద్యార్థులకు పూర్తిస్థాయిలో మెనూ అమలు అవుతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కృష్ణాజిల్లాలో గడిచిన ఆరు నెలలుగా వసతి గృహాల విద్యార్థులకు డైట్ ఛార్జీలు నిలిచిపోవడంతో వసతి గృహ సంక్షేమ అధికారులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడంతో ఆ ప్రభావం విద్యార్థుల డైట్ మెనూ అమలుపై పడుతోంది. ఆరు నెలలుగా డైట్ ఛార్జీలు నిలిచిపోతే వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెనూ ఏ విధంగా అమలు చేయాలని పలువురు వసతి గృహ సంక్షేమ అధికారులు అంటున్నారు. మరోవైపు అప్పులు చేసి విద్యార్థులకు మెనూ అందిస్తున్నామని, ఆరు నెలలుగా డైట్ ఛార్జీలు నిలిచిపోతే కిరాణా షాపుల వాళ్ళు కూడా అప్పులు ఇవ్వడం లేదని దీంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాజిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 40 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 31 ప్రీ మెట్రిక్, 9 పోస్ట్ మెట్రిక్ ఉన్నాయి. వీటి పరిధిలో 2,505 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 43 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో ప్రీ మెట్రిక్ 27, పోస్ట్ మెట్రిక్ 16 వసతి గృహాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2177 మంది విద్యార్థులు ఉన్నారు. వేలాది మంది ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఆయా వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో జనవరి నుండి ఏప్రిల్ వరకు పెండింగ్లో ఉన్న బకాయిలు విడుదల చేసింది. తిరిగి విద్యా (మిగతా 2లో)

సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు

- మొదటి దశలో రూ.14.7 కోట్లతో 239 కిలోమీటర్లు
- త్వరలోనే ఎన్‌డిబి నిధులు రూ.200 కోట్లతో ఏడు రోడ్ల అభివృద్ధి
- ఆర్అండ్‌బి కృష్ణాజిల్లా ఇంజనీరింగ్ అధికారి లోకేశ్వరరావు

ప్రజాశక్తి–కృష్ణాప్రతినిధి

ప్రాధాన్యతా క్రమంలో కృష్ణాజిల్లాలోని రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని రహదారులు, భవనాల శాఖ (ఆర్అండ్‌బి) కృష్ణాజిల్లా ఇంజనీరింగ్ అధికారి ఎస్.లోకేశ్వరరావు తెలిపారు. సంక్రాంతి నాటికి మొదటి దశలో లక్ష్యంగా తీసుకున్న రోడ్లపై గుంతలు పూడ్చి వేస్తామని, ఇప్పటికే పనులు మొదలయ్యాయని చెప్పారు. రూ.200 కోట్ల న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో ఏడు రహదారుల అభివృద్ధి పనులను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని అన్నారు. కృష్ణాజిల్లాలో ఆర్అండ్‌బి రహదారుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

ప్రశ్న: ఆర్అండ్‌బి రోడ్లు ఎన్ని కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి?

జవాబు: జిల్లాలో ఆర్అండ్‌బి స్టేట్ హైవేలు 372.261 కిలోమీటర్లు, (మిగతా 2లో)

నేడు 'దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు - ప్రజల కర్తవ్యం'పై సభ

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ : "దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు – ప్రజల కర్తవ్యం" అంశంపై ఈ నెల 11వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు 'ప్రజా చైతన్య సభ' జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ రాఘవయ్య పార్క్ సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి పాల్గొంటారని పేర్కొన్నారు.

బడ్జెట్‌పై ఆశలు

- నిధుల్లేమితో ముందుకు సాగని ప్రాజెక్టులు
- జిల్లాలో అందరూ కూటమి సభ్యులే
- నేడు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి

ప్రజాశక్తి –కృష్ణాప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న పూర్తిస్థాయి తొలి బడ్జెట్ సమావేశంపై జిల్లా వాసుల ఆశలు పెట్టుకున్నారు. జులై నెలలో ఐదు రోజులు పాటు శాసనసభ సమావేశాలు జరిగిన అందులో ఓటాన్‌అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశ పెట్టింది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నామమాత్రంగా నిధులు కేటాయింపు జరిగినా.. పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించలేదు. ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్న పలు సమస్యలకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పూర్తిస్థాయి బడ్జెట్లో పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు

రాష్ట్ర శాసనసభలో సోమవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తొలుత జూలై నెలలో ఓటాన్‌అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. నేడు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 14 శాసనసభ స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించడంతో ప్రభుత్వం నుంచి ఏ మేరకు జిల్లాల అభివద్ధికి నిధులు మంజూరు చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత కొన్నేళ్లుగా కష్ణా నదిపై చోడవరం, బండికోళ్ల లంక వద్ద బ్యారేజ్ల నిర్మాణానికి సంబంధించి డిపిఆర్ పూర్తి చేసి, నిధులు కేటాయింపుకు పంపిన ఫైలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్ లో ఉంది. ఈ బ్యారేజీలు నిర్మాణం చేపడితే దిగువ ప్రాంతం రైతాంగానికి సాగు, తాగు నీట సమస్యకు, భూగర్భ జలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకు వచ్చే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కృష్ణా డెల్టాలోని కాలువలు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయింది. కొద్దిపాటి వర్షాలకు పొలాలు ముంపు గురవుతున్నాయి. నాలుగు రోజులు ఎండలో వేస్తే శివారు భూములకి నీరు అందక పంటలు ఎండుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి చేపట్టిన డెల్టా ఆధునీకరణ (మిగతా 2లో)

నూతన విద్యా విధానంతో నష్టం

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ
- ముగిసిన యుటిఎఫ్ కృష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభలు

ప్రజాశక్తి–గన్నవరం: నూతన విద్యా సంస్కరణల ప్రమాదాన్ని గుర్తించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, కొత్త ఉద్యోగాలు రాక యువత భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. గన్నవరం రోటరీ ఆడిటోరియంలో షేక్ సాబ్జి వేదికపై రెండు రోజుల పాటు జరిగిన యుటిఎఫ్ కృష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. సభకు యుటిఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షులు బి.కనకారావు అధ్యక్షత వహించారు. తొలుత 'ఆర్థిక సంస్కరణలు... విద్యారంగంపై ప్రభావం' అనే అంశంపై శర్మ మాట్లాడుతూ 50 సంవత్సరాల్లో విద్యావ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. నూతన ఆర్థిక సంస్కరణల ప్రభావం ఉద్యోగులపై ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసే పరిస్థితి లేదని, దీనిపై పోరాడేందుకు సంఘటితంగా ఉండే సంఘాలు తగ్గిపోతున్నాయని అన్నారు. నిజం చెప్పాలంటే సంఘాలతో సంబంధం లేకుండా 94 శాతం మంది ప్రైవేటు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలు, ఆస్పత్రులను గ్రామాల్లో కాకుండా పట్టణాల్లో ఏర్పాటు చేసి అందరిని అక్కడకు రప్పిస్తారన్నారు. ప్రభుత్వ రంగంలో ఉంటేనే గ్రామాల్లో స్కూళ్లు, ఆసుపత్రులు ఏర్పాటవుతాయని చెప్పారు. దేశంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో 15 శాతం మందికి మాత్రమే వారి అర్హతను (మిగతా 2లో)

సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

రోలర్ హాకీలో 'కృష్ణచైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయవాడ: మంగళగిరిలోని స్కేటింగ్ రింక్‌లో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ జరిగిన రోలర్ హాకీ, ఇన్‌లైన్ హాకీ 36వ అంతర జిల్లాల ఛాంపియన్ షిప్‌లో విజయవాడ కృష్ణలంకలోని కృష్ణచైతన్య ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. కోచ్ కబీర్ ఇచ్చిన ప్రోత్సాహం, శిక్షణతో పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో కృష్ణచైతన్యలో 10వ తరగతి చదువుతున్న రామిశెట్టి తేజ హర్ష మొదటిస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రామిశెట్టి హాశ్వంత్ దీపక్ ఇన్‌లైన్ హాకీ సబ్ జూనియర్స్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. జూనియర్స్ విభాగంలో యశ్వంత్, వినిన్, భాను, అల్యాస్, పార్థు, జారు, గణేష్ తదితరులు ఆడారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డిసెంబర్‌లో కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి రోలర్ హాకీ పోటీల్లో పాల్గొంటారు. రోలర్ హాకీ, ఇన్‌లైన్ హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన రామిశెట్టి తేజ హర్ష, రామిశెట్టి హాశ్వంత్ దీపక్‌లను కృష్ణచైతన్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ లకిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అభినందించారు.

హిందూ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం హిందూ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1986వ సంవత్సరంలో పదో తరగతి చదివి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో ఉన్న వారంతా తాము చదువుకున్న పాఠశాలలో ఒక్కటయ్యారు. 38 సంవత్సరాల తర్వాత అంతా కలుసుకుని ముచ్చటించుకున్నారు. తమకు విద్య బుద్ధులు నేర్పిన అధ్యాపకులు జ్ఞానేశ్వర శర్మను ఘనంగా సత్కరించారు. అందరూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. హిందూ హైస్కూల్ 1986 బాచ్ విద్యార్థి ప్రస్తుతం ఎపి మత్స్య శాఖ కమిషనర్ డోలా శంకర్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. స్కూల్ అభివృద్ధికి కొన్ని పరికరాలు బహుకరిస్తామని తెలిపారు.

నేటితో అమరావతి బాలోత్సవం రిజిస్ట్రేషన్లు ముగింపు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరుగుతుంది. విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలో జరిగే ఈ పిల్లల పండుగలో పాల్గొనేందుకు ఈ నెల 11వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్‌కు amaravathibalostavam@gmail.comకు వివరాలు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 6305954249 నెంబర్‌కు సంప్రదించవచ్చు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలను మంగళగిరి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఏ లక్ష్మీ కుమారి ఆదివారం పరిశీలించారు. ముసాయిదా ఫోటో ఓటర్ జాబితా 2025 సవరణ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ క్యాంప్ జరుగుతుంది. ఏ ఈ ఆర్‌వో ల పరిధిలో ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

దూరవిద్యా ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఈనెల 9న శనివారం నిర్వహించిన ఎంబీఏ, ఎంసిఎ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయి. ఈ మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ లు ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశపరీక్షకు 201 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 188 మంది విద్యార్థు లు హాజరయ్యారు. అందులో 184 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ , ఎంసిఏ ప్రవేశాలు నవంబర్ 15 తో ముగుస్తాయని తెలిపారు. ప్రవేశపరీక్షలో అర్హులైన వారి జాబితాను దూరవిద్య కేంద్రం వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఏపీ ఐ సెట్ 2024 లో అర్హత సాధించిన విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు నేరుగా అర్హులని తెలియజేసారు. ఈసందర్భంగా పరీక్షా కేంద్రాల సమన్వయకర్తలకు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కష్టవేణి, సూపరింటెండెంట్ నేలపాటి నాగేశ్వరరావు, ప్రోగ్రామర్ మోహన్, అకాడమిక్ కౌన్సిలర్‌లకు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్ రామచంద్రన్‌లు అభినందించారు.

నేడు వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 11వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ డా. నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు జోనల్ కార్యాలయాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

మిస్సింగ్ కేసుల దర్యాప్తునకు ప్రత్యేక బృందం : సిపి

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలనే సదుద్దేశంతో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో సమీక్ష నిర్వహించి కేసుల గురించి వాటి స్థాయిల గురించి తెలుసుకున్నారు. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులను త్వరితగతిన వారి ఆచూకీ తెలుసుకుని పరిష్కరించేందుకు నగర పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ పి చంద్రశేఖర్, మహిళా ఎస్సై యు.హైమావతి, సిబ్బందితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న 114 మహిళలు, 7 బాలికలు మొత్తం 121 మిస్సింగ్ కేసులను సాంకేతిక, ఆధునిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేసి ఛేదించడం జరుగుతుందని సిపి తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు

మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 1102 కిలో మీటర్లు విస్తరించి ఉన్నాయి. 1475.75 కిలో మీటర్లు ఆర్‌అండ్‌బి రహదారుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం.

ప్రశ్న: మొదటి దశ రహదారిపై గుంతలు పూడ్చే పనులు మొదలయ్యాయా?

జవాబు: మొదటి దశలో సంక్రాంతి నాటికి జిల్లాలో 45 రోడ్లపై 239 కిలో మీటర్లు పరిధిలో గుంతలు పూడ్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. రూ.14.7 కోట్లతో టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టర్లకు వర్కు ఆర్డర్లు ఇచ్చాం. అగ్రిమెంట్లు చేసుకున్నాం. నాణ్యత ప్రమాణాలతో పనులు నిర్దేశించిన లక్ష్యంలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించాం. కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతలను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 2025 మార్చి నెలలో రెండో దశలో ఇతర రహదారులపైన గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపడతాం.

ప్రశ్న: ఎన్‌డిబి రహదారుల పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి?

జవాబు: రూ.10 కోట్లతో మంటాడ-లంకపల్లి రోడ్డు 4.89 కిలోమీటర్లు, రూ.4.3 కోట్లతో గన్నవరం- పుట్టగుంట 2.29 కిలో మీటర్లు, రూ.29.68 కోట్లతో గన్నవరం-నూజివీడు 29.68 కిలోమీటర్లు, రూ.8.83 కోట్లతో తేల్లప్రోలు- ఉయ్యూరు-వల్లూరుపాలెం రోడ్డు 4.35 కిలోమీటర్లు, రూ. 50.32 కోట్లతో కౌతవరం-నిడుమోలు, ఐలూరు రోడ్డు 16.53 కిలోమీటర్లు, రూ.54.83 కోట్లతో మచిలీపట్నం-కమ్మవారిచెరువు వయా చిన్నాపురం రోడ్డు 13.4 కిలోమీటర్లు అభివృద్ధి చేయాలి. ఈ రోడ్లకు మొత్తం రూ.200 కోట్ల న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు మంజూరయ్యాయి. నాలుగు రోడ్లపై 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్ల అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరలోనే వీటి పనులు మొదలవుతాయి.

ప్రశ్న: నూతన వంతెనల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నారా?

జవాబు: జిల్లాలో ఆర్‌అండ్‌బి రహదారులపై 117 వంతెనలున్నాయి. ఈ వంతెనలపై మైనర్ మేజర్ మరమ్మతులకు అంచనాలు రూపొందించాం. నూతనంగా నిర్మించాల్సిన వంతెనలు, మరమ్మతులు చేయాల్సిన వంతెనలు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నాం. నిధులు మంజూరవ్వగానే వంతెన్ల మరమ్మతులు, నిర్మాణ పనులను చేపడతాం.

నూతన విద్యా విధానంతో నష్టం

బట్టి ఉద్యోగాలు వస్తున్నాయని, సచివాలయాల్లో, వాలంటీర్లలో ఇంజనీర్లు ఉండటమే దీనికి నిదర్శనమని తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చి కోట్లు గడించడానికి కార్పొరేట్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని, పాలకులు దానికి సహకారం అందిస్తున్నారని విమర్శించారు. నూతన విద్యా సంస్కరణల వల్ల విద్య వ్యాపారంగా మారిపోతోందని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ సరళీకరణ విధానాల వల్ల ప్రపంచంలో ఎక్కడికైనా ఉద్యోగం కోసం వెళ్లాలనే పరిస్థితి వచ్చిందన్నారు. పాలకుల విధానాలపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి బద్దలవక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు కె.ఎ.ఉమామహేశ్వరరావు, ఎన్‌పి మనోహర్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, గౌరవాధ్యక్షులు ఎన్.ప్రభాకర్‌రావు, సహాధ్యక్షులు సౌకత హుస్సేన్, ఝాన్సీ, కోశాధికారి మరీదు వరప్రసాద్, సంఘ నాయకులు రాజబాబు, రవిబాబు, ప్రసాదరావు పాల్గొన్నారు.

తీర్మానాలు ఇవే...

మహాసభలో పలు అంశాలను తీర్మానించింది. యాప్‌ల భారాన్ని తగ్గించాలని, పేద, దళిత విద్యార్థులను విద్యకు దూరం చేసిన జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలు కొనసాగించాలని, తక్షణమే ఉపాధ్యాయుల నెలవారీ ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించాలని, ఫ్లస్-2 పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కొత్త పిఆర్‌సి ఏర్పాటు చేసి తక్షణమే మధ్యంతర భృతిని చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, ఐదు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న పిఎఫ్, ఇఎల్, సరెండర్ లీవు, డిఎలు తక్షణమే చెల్లించాలని, మున్సిపల్ హైస్కూళ్లల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పియిటీ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని మహాసభ తీర్మానించింది.

మహాసభకు హాజరైన ప్రతినిధులు

హాస్టళ్లలో ఆకలికేకలు

సంవత్సరం ప్రారంభమైన జూన్ నెల నుండి నేటి వరకు డైట్ ఛార్జీలు విడుదల కాలేదు. ప్రభుత్వం సక్రమంగా డైట్ ఛార్జీలు విడుదల చేయకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థుల మెనూపై కూడా పడుతుంది. ప్రభుత్వం ఇచ్చిన మెనూ సక్రమంగా అమలు చేయాలంటే ఎప్పటికప్పుడు ప్రభుత్వం డైట్ చార్జీలు విడుదల చేయాల్సి ఉంది. మరో వైపు పెరిగిన ధరలతో ఇప్పుడున్న మెనూ అమలు చేయడం కుదరదని కొంతమంది వసతి గృహ అధికారులు బహిరంగంగానే చెబుతున్నారంటే వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ఏ విధంగా అమలు అవుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్లో ఉన్న డైట్ ఛార్జీల విడుదలకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బడ్జెట్‌పై ఆశలు

పనులు ఐదు సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేశారు. బుడమేరు ముంపు సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించాల్సి ఉంది అవనిగడ్డ నియోజకవర్గంలో ఏడు అవుట్ ఫాల్ స్లూయిస్ లకు రూ.3044.50 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు తయారుచేసి పరిపాలన ఆమోదం కోసం పంపారు. బుడమేరు ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడం, బుడమేరు పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణ గురవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాలు పంటలు నీటమునిగాయి. జలజీవన్ మిషన్ కింద కేంద్ర కేటాయించిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కింద నిధులు కేటాయించాల్సి ఉంది. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగానికి ఊపిరి పోసేందుకు బడ్జెట్లో ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం, లెనిన్ శత వర్ధంతి సందర్భంగా న్యూ సోషలిస్ట్ ప్రాక్సిస్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒక మెరుగైన సమాజాన్ని నిర్మించగలిగిన సిద్ధాంతాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు రూపొందించారని, ఆచరణలో ఇటువంటి సమాజ నిర్మాణాన్ని నిజం చేసిన మొదటి వ్యక్తి లెనిన్ అని చెప్పారు. రష్యాలో సోషలిస్టు ఉద్యమం మూలమలుపులో ఉన్న ప్రతిసారి లెనిన్ తన సైద్ధాంతిక పోరాటం ద్వారానే బోల్షెవిక్ పార్టీని, రష్యా విప్లవాన్ని సరైన దిశలో నడిపగలిగారన్నారు. వామపక్ష అతివాదులకు వ్యతిరేకంగా, బెర్న్‌స్టీన్ నాయకత్వంలో యూరోపియన్ సోషలిస్ట్ ఉద్యమంలో ముందుకు వచ్చిన రివిజనిజానికి వ్యతిరేకంగా లెనిన్ చేసిన సైద్ధాంతిక పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. సదస్సులో మార్క్సిస్ట సైద్ధాంతిక గ్రంథాలతో ఏర్పాటు చేసిన బుక్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బిపిన్ బలరామ్ (మార్క్స్ సర్కిల్, కేరళ), జయప్రకాష్, డా. ఎస్. సురేష్, ఆర్.రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పేరుతో అక్రమ రవాణా

ప్రజాశక్తి-చల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం అక్రమార్కులకు అడ్డగా మారింది. పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక సరఫరా మాట ఎలా ఉన్నా రెవెన్యూ, పోలీస్ అధికారులకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఘంటసాల మండలం శ్రీకాకుళం లో ఇసుక క్వారీ డంపింగ్ కు అనుమతులు ఇచ్చారని చల్లపల్లి మండల తహసీల్దార్ వనజాక్షి గత నెల 25న మీడియా సమావేశంలో వెల్లడించారు. నదీ తీర ప్రాంతం లో ఇసుక క్వారీకి అనుమతి మంజూరు చేయాలంటే మైనింగ్ ఇరిగేషన్, ఆర్ సి తదితర శాఖల అనుమతులు పొందాల్సి ఉంది. ప్రభుత్వ ప్రతినిధుల పర్యవేక్షణ లేకుండానే నిర్దేశిత సర్వే నంబర్ లలో ఇసుక మంజూరు కు అనుమతులు మంజూరు కాకుండానే యథేచ్ఛగా గత కొద్ది రోజులు గా శ్రీకాకుళంలో ట్రాక్టర్లు టైర్ బండ్లతో ఇసుక రవాణా జరుగుతోంది. చల్లపల్లి, మోపిదేవి మండలాల ప్రజలకు శ్రీకాకుళం రిచ్ దూరం కావడమే గాక ఈ రెండు మండలాలు సిఆర్‌జడ్ పరిధిలో వున్నాయని అదికారులే ప్రకటన చేయడంతో చల్లపల్లి, మోపిదేవి మండలాలలోని లబ్ధిదారులు అనుమతి లేని వెలివోలు, నిమ్మగడ్డ, నడుకుదురు, ఆముదార్లంక, నాగాయతిప్ప ప్రాంతాల నుండి అక్రమ ఇసుక రవాణాకు తెరతీశారు. ఇసుక అక్రమ రవాణా దారులకు పోలీస్,రెవిన్యూ శాఖ లోని కొద్ది మంది ఉద్యోగుల అండతో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా కు కూటమి నేతలు నేతలు సైతం దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే చందన అక్రమ రవాణా ను ప్రోత్సహిస్తున్నట్లు కూడా తెలుస్తోంది.. అనుమతులేని రీచుల వద్ద గాళ్లు కొట్టించినా ట్రాక్టర్లు ,టైర్లబండ్ల ద్వారా ఇసుక రవాణా ఆగటం లేదు. ఉచిత ఇసుక పేరుతో దళారులు జేబులు నింపుకుంటున్నారు తప్ప లేదని పేదవారికి ఒరిగేది ఏమీ లేదని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆహ్లాదంతో పాటు అప్రమత్తత అవసరం : సిఐ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కార్తీక మాసం సందర్భంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌కు వచ్చే భక్తులు,పర్యాటకులు అప్రమత్తంగా వుండాలని మరైన్ సి ఐ వంశీ కష్ణ తెలిపారు.తీర ప్రాంతంలో పిక్నిక్ సందడి మొదలయ్యింది కాబట్టి యువతి యువకులు సముద్ర తీరాల వైపు ఉత్సాహంగా వస్తున్నారని, కుటుంబ సభ్యులందరూ తగు జాగ్రత్తలు పాటిస్తే తీర ప్రాంతంలో మంచి ఆహ్లాదం పొందవచ్చన్నారు. సముద్ర తీరంలో ఆహ్లాదాన్ని పొందే క్రమంలో చిన్న చిన్న పొరపాట్లు వల్ల ప్రమాదాలు పొంచివుండే అవకాశం వుంది కాబట్టి పిల్లాపాపలతో వచ్చిన తల్లిదండ్రులు ఎంతో అప్రమత్తతతో ఉండాలని సూచించారు .తీర ప్రాంత పరిస్థితిని ముందుగానే స్థానిక పోలీసులను, మెరైన్ పోలీసులను అడిగి తెలుసుకోవాలని, నీటి లోతు అలల ఉధతిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా సెల్ఫీలు తీసుకునే సమయంలో అలల ఉధతిని గమనిస్తూ ఫోటోలు దిగాలని, జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వుంటాయని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లోని పోలింగ్ కేంద్రాలను గుడివాడ ఆర్డిఓ బాల సుబ్రమణ్యం ఆదివారం పరిశీలించారు. స్పెషల్ క్యాంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల మార్పులు చేర్పులు పై అధికారులకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ బి లోకరాజు, ఆర్ ఐ పీ శివకుమార్, వీఆర్వో శాయన ప్రకాష్ ఉన్నారు.

కొండలమ్మ దేవస్థానానికి యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సంధర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు10వేల మంది భక్తులు దర్శించుకున్నారు .అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నారు. ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పరిశీలించారు. మచిలీపట్నం అర్బన్‌డెవలప్మెంట్ చైర్మన్ ప్రసాద్ అమ్మవారిని ధర్శించు కున్నారు.

మోపిదేవికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం తెల్లవారు జామునుంచి జిల్లా నుంచే రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు క్యూ లైన్‌లలో బారులు తీరారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోయడానికి, స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు గంటల తరబడి క్యూ లైన్ లలో వేచియున్నారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లీ వక్షం వద్ద మహిళా భక్తులు ముడుపులు కట్టి, మొక్కులు మొక్కుకున్నారు. అన్నదానం ఎదురుగా దేవస్థానం తరపున కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దీపారాధనలు చేసుకొనుటకు ఏర్పాటు చేసిన ప్రదేశంలో పెద్ద సంఖ్యలో దంపతులు దీపారాధనలు చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ తన సిబ్బందితో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్యూ లైన్ లో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం తరపున నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు దాహార్తిని తీర్చడానికి

మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. మోపిదేవి ఎస్ఐ వై వీరవెంకటసత్యనారాయణ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయంలో నిత్యం నిర్వహించే నిత్య అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కోడూరు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ప్రతి కార్యకర్త కుటుంబానికి కొండంత భరోసాని కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి సభ్యుడు బండే శ్రీనివాసరావు అన్నారు. కోడూరు మండలంలోని చినగుడుమోటు, పాదాల వారిపాలెం గ్రామాలలో బూత్ కన్వీనర్లు షేక్ నజీర్ భాష, చిమటూరి చంద్రయ్య ల ఆధ్వర్యంలో జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోగినేని సోమశేఖర రావు ,కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ చిముటూరి వెంకటేశ్వరరావు అప్పికట్ల రవీంద్రబాబు, అద్దంకి రవికష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని కూరాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ

కోడూరు మండలంలో సభ్యత్వం నమోదు చేస్తున్న దృశ్యం

సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూరాడ గ్రామ పార్టీ అధ్యక్షులు బాస రాంబాబు, కూరాడ టీడీపీ ప్రధాన కార్యదర్శి కళ్యాణపు నవాబు,శీరం రమేష్, పులి ప్రసాద్ పాల్గొన్నారు.

105 మందికి వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధు మేహ వ్యాధి శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గవిర్నేని రజిని 105 మందికి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరానికి కావలసిన ఆర్థిక వితరణ లయన్ డాక్టర్ నర్రా గంగాధరరావు, లయన్ కొసరాజు బాపయ్యాచౌదరి, లయన్ వల్లభనేని రామకష్ణ లు సహకారంతో ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, సిహెచ్ రాజేశ్వరరావు, కొంచెంపర్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో పడి మల్ల గౌతమ్ (4) మృతిచెందిన ఘటన పమిడి ముక్కల మండలంలో ఆదివారం జరిగింది. కొందరు చేపల జీవనాధారంగా బతుకుతున్న కుటుంబాలు వీరంకిలాకులు గట్టుపై ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో మల్ల గౌతమ్ అనే బాలుడు ఆడుకుంటూ వెళ్లి కాలువలో పడిపోవడంతో వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పమిడిముక్కల ఎస్ఐ శ్రీను తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు గ్రామానికి చెందిన వాసా రమేష్ అలియాస్ పిచ్చయ్య (55) శనివారం రాత్రి గొడవర్రు లాక్ వంతెనపై గోడ మీద కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తు వెనక్కి కాలువలో పడిపోయాడు. ఇతను పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే శనివారం జనసేన నేత పుట్టినరోజు సందర్భంగా తనకు వ్యాపారానికి అడ్డంగా బ్యానర్ కట్టిన విషయంపై వాగ్వాదం జరిగినట్లు, మృతుడు మనస్థాపానికి గురై కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై కంకిపాడు ఎస్ఐ సందీప్‌ని వివరణ అడగ్గా తన భర్త తూలు వచ్చి కాలువలో పడినట్టు భార్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. బ్యానర్ విషయంపై వివరణ అడగ్గా ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గల్లంతయిన వ్యక్తి కోసం ఇప్పటికే గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గాలింపు చర్యలను తహశీల్దార్ భావనారాయణ, సిఐ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సందీప్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఎస్ఐ సందీప్‌కుమార్ కౌన్సె లింగ్ నిర్వహించారు. రౌడీ షీట్ కలిగిన వాళ్లు సత్రవర్తనతో ఉండా లని, ఎటువంటి కేసులలో కూడా ఉండకూడదని, లా అండ్ ఆర్డర్ కి ఇబ్బంది కలిగించే విషయాలు ఏమీ చేయకూడదని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-గన్నవరం : సామాజిక మాధ్యమాల్లో దురుద్దేశపూర్వకంగా, అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కొంతమంది వ్యక్తులు అవతలి వ్యక్తులను ఇష్టానుసారం తిడుతూ మార్ఫింగ్ ఫొటోలు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. ఒక్కసారి కేసు నమోదైందంటే ఆ వ్యక్తిపై నిఘా ఉంటుందని తెలిపారు. ఇతరులను కించపరుస్తూ మాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా, లైక్‌లు కొట్టినా, ఫార్వర్డ్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలే ధ్యేయం : సిపిఎం

మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ప్రజా సమస్యలపై సమశీల పోరాటాలే ధ్యేయంగా సిపియం ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. కొండపల్లి సిపిఎం 8వ పట్టణ మహాసభ కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, కామ్రేడ్ మల్లెల సాంబశివరావు, కామ్రేడ్ చిమటా హనుమంత రావు ప్రాంగణంలో కొండపల్లి క్రాంతి కాన్వెంట్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆరు పంపుల సెంటర్లో పార్టీ జెండా ఆవిష్కరించి, అక్కడ నుంచి ర్యాలీగా సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ మహాసభ కు ముఖ్య అతిథిగా బాబూరావు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజాపోరులో భాగంగా 14న కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, సిపిఎం నాయకులు ఎ.విఠల్‌రావు, కొండపల్లి శాఖా -1 కార్యదర్శి సిహెచ్.శివ సుందరరావు, కొండపల్లి శాఖా -2 కార్యదర్శి వి.మురళీమోహన్, కొండపల్లి శాఖా -3 కార్యదర్శి షేక్ బాషా, ఇబ్రహీం పట్నం -1 శాఖా కార్యదర్శి ఇర్లా కొండలరావు, మహిళా శాఖా కార్యదర్శి కె.బేబీ సరోజిని, ఇబ్రహీంపట్నం హాకర్స్ శాఖ కార్యదర్శి బి.రమణమ్మ, గుంటుపల్లి శాఖా కార్యదర్శి ఆర్.మల్లిఖార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపోరు ప్రచారం, కరపత్రాలు పంపిణీ

విజయవాడ రాణిగారి తోటలో...

విజయవాడ 61వ డివిజన్‌లో...

విజయవాడ : నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమం రాణిగారి తోటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాపోరు కార్యక్రమం వాడవాడలా నిర్వహిస్తున్నామన్నారు. నిత్యావసర సరుకుల ధరలు షాక్‌కు గురిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నగర నాయకులు టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కృష్ణలంక సిపిఎం 22వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమం ఆదివారం జరిగింది. మోడీ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ బ్యానర్‌చేబూని, ఫ్లెక్సీలతో డివిజన్ వ్యాప్తంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ మాట్లాడారు. సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, నాయకులు కాయల లక్ష్మణరావు, వాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా సింగ్‌నగర్ 61 డివిజన్ శాంతినగర్ మసీదు ఏరియాలో గ్రూప్ మీటింగ్‌ల కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు చింతల శ్రీనివాస్ మాట్లాడారు. పార్టీ శాఖ కార్యదర్శి చింతల అరుణ, **నందిగామ :** నందిగామ పట్టణంలో 7, 8, వార్డుల్లో సిపిఎం నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ఇంతవరకు వరద సాయం అందలేదని 7వ వార్డు ప్రజలు సిపిఎం బృందానికి దృష్టికి తీసుకువచ్చారు. ఖాళీ స్థలాల్లో నీరు ఎక్కువగా ఉండి దోమలు బాగా విపరీతంగా పెరిగాయని, దోమలను పిచికారి చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు సయ్యాద్ ఖాసిం, వల్లూరు రవి శేఖర్, జి.గోపి నాయక్, ఆకుల వెంకటనారాయణ, తిమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక వ్యాపారంపై స్పందించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : ఒక్క ఆళ్ళూరిపాడు క్వారీ నుండే ప్రతి రాత్రి రూ.పది లక్షలు ఎంపి కేశినేని చిన్ని, ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య జేబుల్లోకి వెళ్తున్నాయని రాష్ట్ర వైసిపి కార్యదర్శి ఇంటూరి చిన్న విమర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డబ్బులు తాతయ్యకు అందటం లేదనుకుంటే ఆయనకు తెలీకుండా తన నియోజకవర్గంలో ఇంత పెద్ద అక్రమ ఇసుక వ్యాపారం నడుస్తుందా అని విమర్శించారు. ఈ అక్రమ ఇసుక వ్యాపారంపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, సామినేని ఉదయభాను ఇద్దరు కూడా తమ సొంత నియోజకవర్గంలో ఇంత పెద్ద అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతున్నా మాట్లాడటం లేదంటే! పెద్ద నాయకులకు తెలియకుండా కిందిస్థాయి గ్రామ, మండలస్థాయి నాయకులు రాత్రిపూట ఇంత బారి ఎత్తున అక్రమ ఇసుక క్వారీలు నడపలేరు అని అన్నారు.

శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - తిరువూరు : ప్రజా నాట్య మండలి జిల్లా శిక్షణా తరగతులు తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రారంభ మయ్యాయి. జనవరి 3,4,5 తేదీల్లో తిరువూరులో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి అప్పన్న తెలిపారు. ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్న భారాలను, పడుతున్న ఇబ్బందుల ను పాటలు రూపంలో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ప్రజలను చైతన్యం చేసేందుకు కళలు ఎంతో దోహదపడతాయని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గాయకులు జగన్ పేర్కొన్నారు. పి.తులసీ రాణి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా తరగతుల్లో ప్రజానాట్యమండలి కళాకారులు పి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.కె.దాదు, ఎం.నాగమణి, రాణి, డప్పు కళాకారుడు వీరరాజు పాల్గొన్నారు.

పెరేడ్‌కు డాక్టర్ రమేష్ ఎంపిక

ప్రజాశక్తి - విజయవాడ : నవంబర్ 12 నుండి 21 వరకు జరిగే ప్రి రిపబ్లిక్ డే పెరేడ్‌కు జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్ఎస్ కంటేజెంట్ లీడర్‌గా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ ఉత్తర్వులు పంపారు. ఈ సంవత్సరం జరిగే ప్రి రిపబ్లిక్ డే పెరేడ్, మహారాష్ట్రలోని జెల్గాన్‌లో ఉన్న నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో ఈ నెల 12 నుండి 21 వరకు జరిగే ప్రి రిపబ్లిక్ డే పెరేడ్‌కు రాష్ట్రం నుంచి ఎన్ఎస్ఎస్ మేల్ కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ కొల్లేటి రమేష్ నియమితులయ్యారు. రాష్ట్రంలోని 16 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాల నుంచి 44 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వారిలో 22 మంది బాయ్స్ 22 మంది గర్ల్స్ ఈ శిబిరానికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 11న వీరందరినీ మహారాష్ట్ర వెళ్లనున్నారని తెలిపారు. ఈ క్యాంపులో ఎన్ఎస్ఎస్ శిక్షణా తరగతులు పొంది నవంబర్ 22న తిరిగి వస్తారని, అక్కడ ఎంపికైన వారిని జనవరి 26న న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, జిల్లా ఆఫీసర్లు, పట్టణ ప్రముఖులు డాక్టర్ కొల్లేటి రమేష్ ని అభినందించారు.

మండలాభివృద్ధికి కలిసి కృషి చేద్దాం: ఎంపిపి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల అభివృద్ధి కోసం అధికారులందరూ ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు రామినేని దేవి ప్రవీణ్య వీరస్వామి నాయడు అన్నారు. మండల పరిషత్ సభామందిరంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు కోసం అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణ, జెడ్‌పిటిసి సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్, పాటిబండ్ల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి దేవి ప్రవీణ్య

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని 44వ డివిజన్లలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 44వ డివిజన్ విద్యాధరపురంలోని చెరువు సెంటర్‌లో డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి దుర్గారావు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా 44వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ డివిజన్లో ఇప్పటివరకు 750 పైగా టిడిపి సభ్యత్వాలను నమోదు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చౌడ శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బడుగు గణేష్, గుంజా ఏడుకొండలు, పెదప్రోలు బాలసుబ్రహ్మణ్యం, మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.

సభ్యత్వాలను అందిస్తున్న టిడిపి అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, బడుగు గణేష్ తదితరులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- నందిగామ : 24న విజయవాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నందిగామ రైతు పేట కంచర్ల సుబ్బారావు భవన్ (యూటీఎఫ్ భవన్)లో యుటిఎఫ్ మండల స్వర్ణోత్సవ మహాసభ, నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా ఎం.వి.ఎన్.ఎస్. బెనర్జీ వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య, సహ అధ్యక్షులు మన్నేపల్లి కృష్ణయ్య, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కోశాధికారి కె,సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులకు వేతన సంఘం కమిటీని(పి ఆర్ సి) వేసి అప్పటిలోపు ఐ.ఆర్ ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఎఫ్ ఎపిజెఎల్ఐ ఫైనల్ పేమెంట్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పిఆర్సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. నందిగామ, చందర్లపాడు మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నికైనారు. 2024- 25 సంవత్సరానికి నందిగామ మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా ములుగు శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎం.వి.ఎన్.ఎస్ బెనర్జీ, సహాధ్యక్షులుగా టి.వెంకటేశ్వరరావు, సహాధ్యక్షురాలిగా గిరిసుజ, ప్రధాన కార్యదర్శిగా చిన్నం నరసింహారావు, కోశాధికారిగా గడ్డం లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా అన్నాబత్తుల సత్యనారాయణ, విజయ్ కుమార్, వేల్పుల భూషణం, పి.విజయలక్ష్మి, కుంచెం లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. చందర్లపాడు మండలం కమిటీ గౌరవ అధ్యక్షులుగా భూక్య సీతారాం, అధ్యక్షులుగా పెంట మాల రామారావు, సహ అధ్యక్షులుగా బాణావతి శ్రీనివాస్ నాయక్, సహాధ్యక్షురాలుగా సనక సువర్చల, ప్రధాన కార్యదర్శిగా బిట్టు సత్యనారాయణ, కోశాధికారిగా తెల్లబోయిన వెంకటాద్రి, కార్యదర్శులను ఎన్నుకు న్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బొద్దుకోలు రమ ణయ్య, నాయకులు మహేశ్వర వెంకటేశ్వరరావు, జె.గంగ రాజు, ఎం. కోటేశ్వరరావు, ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ అత్యంత ప్రజాదరణ పొందిన ఆరవ తరం పోర్టబుల్ స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి కె.రాజశేఖర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శామ్‌సంగ్ స్టోర్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. పోర్టబుల్ శాంసంగ్ గెలాక్సీస జడఫోల్డ్‌పై అద్భుతమైన ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు. గెలాక్సీ జెడ్‌ఫోల్డ్ 6 కొనుగోలు చేసిన వినియోగదారులు 24 నెలల నో కాస్ట్ ఈఎంఐతో పాటుగా రు. 1,44,999ల కంటే తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్‌ను పొందవచ్చని తెలిపారు. గెలాక్సీ జెడ్ ఫ్లిప్6 స్మార్ట్‌ఫోన్ రూ.89,999లకు నో కాస్ట్ ఈఎంఐతో పొందవచ్చని తెలిపారు. రు. 2500లు, రు. 4028ల సులభమైన ఇఎంఐతో ప్రారంభమవుతుందని తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంచికచర్ల : పశువులను తోలుకెళ్లి వ్యక్తి ప్రమాదవ శాత్తు మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలోని గొట్టుముక్కలలో జరిగింది. మృతుని బంధువుల కథనం మేరకు గొట్టుముక్కల గ్రామానికి చెందిన దమ్మాలపాటి సత్యనారాయణ (42) ఆదివారం గేదెలు మేపేందుకు పొలం వెల్లాడు. గ్రామానికి తూర్పు వైపున వీరులపాడు మండలం నరశింహారావుపాలెం రెవెన్యూ పరిధిలో గల గుబ్బల్ల చెరువులోకి పశువులు వెళ్లాయి. చెరువులోకి వెళ్లిన పశువులను బయటకు తోలేందుకు చెరువులోకి దిగగా, నీటిలో ప్రమాదవశాత్తు కాలుజారిపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు చెరువులో మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు.

48వ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొండ ప్రాంతమైన 48వ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పెదబాబు ఎంఎల్ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. 48వ డివిజన్‌లోని రోడ్లు, డ్రెయిన్లు, సైడ్ కాల్వలు, కొండ ప్రాంతంలోని మెట్లు, అలాగే రిటైనింగ్ వాల్ నిర్మాణం, బూస్టర్ రూములను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి పెండింగ్ పనులను పూర్తి చేస్తూ పశ్చిమలోని సమస్యల శాశ్వత పరిష్కారానికి ఎంఎల్ఎ సుజనా చౌదరి కృషి చేస్తున్నారని ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఎంఎల్ఎ కార్యాలయంలో వినతిపత్రం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ఎంఎల్ఎ సుజనా టెండర్ల ప్రక్రియ ప్రారంభించారన్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసేలా సుజనా చౌదరి కృషి చేస్తున్నారని తెలిపారు. జనసేన నేతలు దిండి నాని, వి.నాగరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజా పోలీసింగ్ వ్యవస్థకు కృషి

• గన్నవరం సిఐ బివి శివప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం : ఒకప్పుడు గన్నవరంలో పోలీసుల పేరు చెబితే జనం వణికిపోయేవారు. స్టేషన్‌కి వెళ్లాలంటే భయపడేవారు. ఎందుకంటే పోలీస్ అధికారుల పనితీరు అంత కరుకుగా ఉండేది. అలాంటిది పోలీస్ పనితీరులో క్రమంగా మార్పులు వచ్చాయి. ప్రజలకు పోలీసులు సేవకులుగా ఉండాలని, వారితో మమేకం కావాలనే పరిస్థితులు నేడు వచ్చాయి. లా అండ్ ఆర్డర్ పరంగా ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారులకు చెప్పుకునే అవకాశాన్ని కల్పించామని అంటున్నారు సీఐ బి. వి. శివ ప్రసాద్.

ప్రశ్న.. గన్నవరం పిఎస్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి. ఎంతమంది ఎస్ఐలు ఉన్నారు?

జవాబు : 20 గ్రామాలు ఉన్నాయి. ఇద్దరు ఎస్ఐలు ఉన్నారు. ఏఎస్ఐ లతోపాటు సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారు.

ప్రశ్న. ఏ ఏ గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి?

జవాబు : కేసరపల్లి, ముస్తా బాద, అల్లాపురం, అజ్జంపూడి, దావాజీ గూడెంలు సమస్యాత్మక గ్రామాల్లో ఉన్నాయి. వీటిలో కొంతమంది అసాంఘిక శక్తులుగా ఉన్నారు. కొంతమంది రౌడీలుగా ఉన్నారు. దొంగలు కూడా ఉన్నారు. వీరందరి పైన రోజువారి నిఘా పెట్టాం. స్టేషన్ కు రప్పించి వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం.

ప్రశ్న : గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా ముంద స్తుగా చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా?

జవాబు : సమస్యాత్మక గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా పట్టిష్ట చర్యలు తీసుకుంటున్నాం. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పెద్దలతో మాట్లాడుతున్నాం. చిన్నపాటి సమస్యలు వస్తే గ్రామాల్లోని పెద్దల మధ్య కూర్చుని పరిష్కరించుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తున్నాం. ప్రతి చిన్న విషయానికి స్టేషన్ కు వచ్చి కేసులు పెట్టుకుని ఇబ్బంది పడవద్దనే ఆలోచనను ప్రజల్లో కి తీసుకు వెళుతున్నాం.

ప్రశ్న.. గంజాయి నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : గన్నవరం పీఎస్ పరిధిలో గంజాయి విక్రయాలు లేకుండా చేయడానికి పటిష్ట చర్యలు చేపట్టాం. ముఖ్యంగా రాజీవ్ కాలనీ, అల్లాపురం, చెంచుల కాలనీ, విఎన్ పురం గ్రామాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నట్లుగా సమాచారం ఉంది. దూర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి యువకులకు విక్రయించి జేబులు నింపుకుంటున్న పరిస్థితి ఉంది. అలాంటి వారిని నికాబంధాల ద్వారా గుర్తించి గంజాయి అమ్ముతుండగా పట్టుకుని అరెస్ట్ చేస్తున్నాం. నిఘా బందాలు ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నాయి.

ప్రశ్న.. చివరిగా ప్రజలకు మీరు చెప్పేది ఏమిటి?

జవాబు : ప్రజలకు నేను చెప్పేది ఒకటే. ప్రజలకు లా అండ్ ఆర్డర్ పరంగా ఏ సమస్య వచ్చినా నేరుగా స్టేషన్కు వచ్చి తనను కలుసుకోవచ్చు. విచారించి న్యాయం చేసే బాధ్యతను నేను తీసుకుంటా. మాయమాటలు చెప్పే వాళ్ళు కొంతమంది ఉంటారని, అలాంటి వ్యక్తుల మాటలు నమ్మవద్దని ప్రజలను కోరుతున్నా. గ్రామాలలో ఎక్కడైనా రహస్యంగా పేకాట,కోడి పందాలు, గంజాయి విక్రయాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలి. మీ వివరాలను గోప్యంగా ఉంచుతాం.

హంసలదీవిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-కోడూరు : కార్తీక మాసం ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, విహార యాత్రికులు పెద్ద సంఖ్యలో హంసలదీవి పాలకాయతిప్ప బీచ్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాలకాయ తిప్ప మెరైన్ పోలీస్ సిబ్బందితో కలిసి మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి బీచ్ వద్ద పర్యాటకులకు స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు. అలాగే బీచ్ వద్ద స్నానాలు చేసేటప్పుడు వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు. కోడూరు సివిల్ పోలీసులు, పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తా మని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగ ుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

సుందరయ్య రెడ్‌వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గన్నవరం : సుందరయ్య రెడ్ వాలంటీర్స్ బుద్ధవరం రోడ్డు నుండి గర్ల్స్ హైస్కూల్ వరకు రోడ్డు ఇరువైపులా డ్రైనేజీని క్లిన్ చేసి, పిచ్చి మొక్కలను తొలగిస్తూ ఆదివారం శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో లీడరు ఎం. ఎన్. బ్రహ్మ చారి మాట్లా డుతూ భవిష్యత్తులో ప్రతి ఆదివారం రెడ్ వాలంటీర్స్ దళం మళ్లీ తమ సేవలను కొనసాగిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రి గాని, ప్రభుత్వ సంస్థలు సంబంధించినటువంటి వాటిలో ఉన్నటువంటి డ్రైనేజీ ని కూడా బాగు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళ సభ్యులు మిరప నాగేశ్వరావు, కైలే ఏసుదాసు, మల్లంపల్లి ఆంజనేయులు, డాక్టర్ అంతోని కొంతమంది సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

మురుగు కాలవ క్లిన్ చేస్తున్న దృశ్యం

రెండో రోజుకు నిరాహార దీక్ష

రెండోరోజు దీక్షల్లో పాల్గొన్న
రైతు సంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మెయిన్ కాల్వకు నీరు విడుదల చేసి దాళ్వాకు సాగుకు అనుమతివ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి సెంటర్లో నిర్వహిస్తున్న నిరాహారదీక్ష ఆదివారంతో రెండో రోజుకు చేరింది. ఈ దీక్షను రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన్ రావు ప్రారంభించారు. ఈ నిరాహార దీక్ష శిబిరానికి బంటుమిల్లి మండల ఎంపీపీ వెలవెల చిన్న బాబు , జనసేన నాయకులు బత్తిన హరి రామ్, చర్ల నవీన్ కష్ణ, కనపర్తి వెంకటేశ్వరరావు వైసిపి నాయకులు సుజ్ఞానం మహేష్, ముత్యాల నాగేశ్వరరావు తదితరులు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా రైతుసంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్, సిఐటియు నాయకులు మాజేటి శ్రీనివాసరావు, బంటుమిల్లి కత్తివెన్ను మండలాల్లోని రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల ధర్నా

ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : 104 సర్వీస్ లను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ ఎపి 104 ఎంఎంయు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కలక్టరేట్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు ఈ సంద ర్భంగా సంఘ అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 104లో ఉద్యోగులుగా సుమారు 16 సంవత్సరాల నుండి ప్రజలకు సేవలు అందిస్తున్నామని, గతం లో ప్రభుత్వ అధీనంలో పని చేస్తున్న మమ్ములను వైసీపీ ప్రభుత్వం అరబిందో యాజమాన్యానికి అప్పగించిందని దీంతో డ్రైవర్స్, డిఈఓలుగా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్రంలో ఇతర అవుట్ సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులు కంటే చాలా తక్కువ వేతనాలకు పని చేస్తూ అన్యాయం నకు గురి అవుతున్నామన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎన్ని సార్లు గత ప్రభుత్వం దష్టికి తీసుకువచ్చినా పరిస్కారం కాలేదన్నారు.కాబట్టి ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి అరబిందో యాజమాన్యంతో చర్చించి తమకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు అన్నీ కూడా సత్వరం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు కృష్ణా జిల్లా అధ్యక్షులు బి సుబ్రహ్మణ్యం, ఎల్ ఐ సి యూనియన్ నాయకులు కిషోర్ సంఘీభావం తెలిపారు. ఈ ధర్నా లో 104 ఎంఎంయు రాష్ట్ర అధ్యక్షులు వి ఫణి కుమార్ , కష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కోమలి , పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పాపారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చిలకలపూడి పాపారావుకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన జనసేన పార్టీ నాయకులు, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావును ఆదివారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకా రుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి పాపారావు తనవంతు కృషి చేశారని భవిష్యత్తులో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా తన సేవలు ఉండాలని బుద్ధ ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంబంధించిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు శ్రీ మల్లికార్జున విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటాలని శ్రీ మల్లికార్జున స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి లత అన్నారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తమ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న మానికొండ సాయి ప్రశాంత్ గత నెల నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 ఫెన్సింగ్ సబర్ విభాగంలో కృష్ణా జిల్లా తరపున ఆడి తన సత్తా చాటి కాంస్య పతకం సాధించాడని చెప్పారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా చురుకుగా ఉండే సాయి ప్రశాంత్ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్లో జాతీయ స్థాయిలో ఫెన్సింగ్ పోటీల్లో కూడా తన సత్తాను చాటి మన రాష్ట్ర జిల్లా పేరు ప్రతిష్టలను పెంచాలని కోరారు. ఈ విద్యార్థికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు వంశీకష్ణను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకట గురుమూర్తికి అభినందనలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్గా నియమితుడైన వీరంకి వెంకట గురుమూర్తికి తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అభినందనలు తెలిపారు. తోట్లవల్లూరులో ఆదివారం పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజాతో గురుమూర్తిని కలిసి పుష్పగుచ్ఛం అందేసి దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ కోసం విశేష సేవలందించిన గురుమూర్తికి పార్టీ అధిష్టానం చైర్మన్ పదవితో గౌరవించడం సంతోషకరమన్నారు.

నందిగామ మార్కెట్ యార్డులో అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మార్కెట్ యార్డు పరిధిలో అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. యార్డు పరిధిలో కోల్డ్ స్టోరేజ్‌లలో రైతులు నిల్వ చేసిన మిర్చిని కొనుగోలు చేసిన వ్యాపారుల వద్ద సెస్ వసూళ్లు చేయవలసి ఉంటుంది. ఈ సెస్ వసూళ్ల విషయంలో కొన్ని సంవత్సరాలుగా అనేక అవకతవకలు జరిగినట్లు సమాచారం. నందిగామ మార్కెట్ యార్డులో గొర్రెలు, గేదెలు అమ్మకం కొనుగోలు సందర్భంగా సిబ్బంది వసూళ్లు చేసే చెస్ విషయంలో కొంతమంది సిబ్బంది భారీగా చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొనుగోలుదారుల వద్ద చెస్ అంటూ నగదు వసూళ్లు చేసి రసీదు కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఈ అక్రమ వసూళ్లకు యార్డు అధికారుల మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి శుక్ర, శనివారాలలో నందిగామ మార్కెట్ యార్డులో భారీగా పశువులు, మేకలు, గొర్రెలు నాటు కోళ్ళు అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ యార్డులో జరిగే సంతకు చాలా దూర ప్రాంతాలకు చెందిన కొనుగోలు దారులు సైతం వస్తుంటారు. అయితే కొనుగోలు దారులు తాము కొన్న జీవాలకు సంబంధించి యార్డుకు చెస్ చెల్లించవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం నాడు భారీస్థాయిలో అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ యార్డు సెక్రటరీ కానీ సూపర్ వైజర్ కానీ విధిగా డ్యూటీలో ఉండాలి. కానీ వీరు ఎవరు ఇక్కడ కనిపించాలనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా తమకు అనుకూలమైన సిబ్బందిని నియమించుకుని రసీదులు లేకుండా అక్రమ వసూళ్ళు చేస్తున్నట్లు సమాచారం. కేవలం రసీదులు రాసిన ఎమౌంట్ పు మాత్రమే యార్డుకు జమ చేసి రసీదులు లేకుండా వసూలు చేసిన నగదును సిబ్బంది వాటాలు వేసుకుంటు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలాకాలంగా ఈ తంతు జరుగుతున్న జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అయితే సంతా సందర్భంగా వసూలు తప్ప అమ్మకం దారులకు, కొనుగోలు దారులకు కనీసం మంచినీళ్ళ సౌకర్యం కూడా యార్డు అధికారులు కల్పించడం లేదు. కనీసం పశువులకు, మేకలు గొర్రెలకు తాగేందుకు నీళ ఎర్పాటు చేసిన దాఖలాలు లేవు.

మా పిల్లలతో మాట్లాడనివ్వండి

మైలవరం గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల పడిగాపులు

ప్రజాశక్తి - మైలవరం : 'మా పిల్లలతో మాట్లాడే అవకాశం ఇవ్వండి మహా ప్రభో' అంటూ తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వివరాలు పరిశీలిస్తే మైలవరంలో గురుకులం ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికలు) వద్ద ఆదివారం జరిగింది. మైలవరంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో 3వ తరగతి నుండి 10 వరకు వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 260 మంది బాలికలు ఉన్నారు. నెలలో 2వ ఆదివారం పిల్లలను చూసేందుకు తల్లులకు అవకాశం ఇచ్చేవారు. రెండో ఆదివారం కావడంతో కొంతమంది బాలికల తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వస్తూ ఉంటారు. మధ్యాహ్నం 1గంట దాటిన లోపలకు అనుమతి ఇవ్వకపోవడంతో గేటు వద్దే పడికాపులు పడుతూ ఎండలో గంటల తరబడి నిలిచి ఉండలేకపోతున్నామని పిల్లలను చూసేందుకు అవకాశం కల్పించాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. కొంత సమయం తర్వాత ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి బాలికల తండ్రులను పిలిచి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు బాలికల తండ్రులు ఎంతో దూరం నుంచి వస్తున్నామని, రెండు గంటలైనా పిల్లలను చూసేందుకు అవకాశం ఇవ్వకపోతే ఎలా అని గేటు వద్దే నిల్చుంటున్నామని నెలకు ఒకసారైనా పిల్లల్ని చూసుకునే వీలు లేదా అని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మూడు రోజులు ఒకే కూర వడ్డిస్తున్నారని దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ని వివరణ కోరగా గతంలో కొంతమంది పేరెంట్స్ ఇంటి వద్ద నుండి తీసుకువచ్చిన భోజనం తిని ఒక విద్యార్థిని అస్వస్థకు గురైతే ఆ బాలిక తల్లిదండ్రులు తాము పెట్టిన భోజనం వల్లే ఫుడ్ పాయిజన్ అయిందని తామే కారణమని చెబుతున్నారని అన్నారు. అందుకనే రెండో ఆదివారం బాలికలకు భోజనం తిన్న తర్వాతనే తల్లులకు లోపలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ హాస్టల్లో ఎక్కువమంది వస్తే స్థలం సరిపోదని అన్నారు.

హాస్టల్ గేటు వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నిధుల వినియోగంలో వివక్ష

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల టిడిపి అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డిపై ఆ పార్టీలో కొందరు అసమ్మతి నేతలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికార పార్టీకి ప్రతినిధిగా ఉంటూ సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులపైనే కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యేలు వసంత వెంకట కృష్ణ ప్రసాదు ద్వారా మంజూరైన నిధులను ఎలా ఉపయోగించాలనే అంశంలో ఎస్సీ ఏరియా పట్ల నాగేశ్వరరెడ్డి వివక్ష చూపారని ఆరోపించారు. ఆ విషయమై తాము ప్రశ్నించగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వరదల కారణంగా నష్టపోయిన ఎస్సీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని వారు విమర్శించారు. పార్టీలో వర్గ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు మాతంగి రామారావు, చాట్ల అచ్చియ్య, బాబూరావు, కె.విజయ కుమార్, కృష్ణ, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

వాటిలో వాస్తవం లేదు : తనపై సొంత పార్టీ వారే చేసిన ఆరోపణలు గురించి టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డిని సంప్రదించగా తనపై ఆరోపణలు అన్ని అవాస్తవాలేనని ఖండించారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఒటిపి నిబంధనను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆస్తులు రిజిస్ట్రేషన్ సమయంలో ఉపయోగించే నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్లను కొనుగోలు చేయాలంటే కొనుగోలుదారుని ఫోన్‌కి ఒటిపి చెప్పాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఉప ఉపసంహరించు కోవాలని జగ్గయ్య పేట దస్తావేజుల లేఖరుల అధ్యక్షులు మాడపాటి కిషోర్ బాబు ప్రభుత్వానికి విన్నవించారు. పట్టణంలోని ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టాంపు ఇచ్చే సమయంలో స్టాంప్ వెండర్లకి పని భారం అవుతుందని స్టాంపు విక్రయించే సమయంలో కంప్యూటర్ ప్రింటర్ స్కానర్ ఇంటర్నెట్ కనెక్షన్ తప్పనిసరిగా అవుతుందని పేర్కొన్నారు. కక్షిదారులను, వెండర్‌ను దృష్టిలో పెట్టుకొని పాత పద్ధతిలోనే రికార్డులు నమోదు చేసుకునే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గోశాలకు వరిగడ్డి అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : తిరు పతమ్మ దేవస్థానానికి చెందిన గోశాలలోని గోవుల గ్రాసం కోసం పెనుగంచి ప్రోలు గ్రామ వాస్తవ్యులు ఆలయ మాజీ చైర్మన్ టిడిపి నాయకులు నూతలపాటి చెన్న కేశవరావు ద్వారా గోవులకు 500 వరిగడ్డి కట్టలు దానంగా అందించారు. మొదటిగా శనివారం 100 కట్టలు పంపించారు. వారికి ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి భూపతి రాజు సత్య నాగకిశోర్ కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరరావు, వరిగడ్డి దాతకు శు భాభినందనలు తెలిపారు.

దూండి రాకేష్ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - వత్సవాయి : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లా వాసి దుండి రాకేష్‌ను నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం తొలి అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు వత్సవాయిలో తన పరిపాలన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ కమిటీ సభ్యులు చెన్నా బాలకృష్ణ, జిల్లా సంఘం ప్రాంతీయ కార్యదర్శి చిరునోముల రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం శెట్టి నాగేశ్వరరావు, వత్సవాయి మండల సంఘం అధ్యక్షులు పోలా పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు గుర్రం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ఈ నియామకం పట్ల కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యం లో వరద ముంపునకు గురి అయిన కేతనకొండ, చిలుకూరు, కాచవరం, గ్రామస్తులకు సుమారు 300 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు, షర్టులు పంపిణీ చేశారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల కారణంగా అనేక మంది ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని వరద వల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోయారన్నారు. స్థానికులకు తాము అండగా ఉండటానికి గ్రేస్ మినిస్ట్రీస్‌గా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో కూడా గ్రేస్ మినిస్ట్రీస్ ద్వారా అనేకమైన సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, అబ్రహం, యోహాను, పాల్, ప్రభుదాస్, సాగర్, హరీష్, యోబు, అనిల్, నాగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా సత్య శేఖర్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జాతీయ బిసి సంక్షేమ సంఘం కమిటీ ఈ నెల ఆదివారం శ్రీశైలంలోని బిసి భవన్‌లో జరిగిన సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు జగ్గయ్యపేట నియోజకవర్గ జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా రాచబంటి సత్య శేఖర్‌ని నియమిస్తూ జాతీయ కార్యదర్శి పి.ఎల్.ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు నియామక పత్రం అందజేశారు. బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పచ్చిపాల నాగేశ్వరావు యాదవ్, గుమ్మా చంద్రశేఖర్, ఆనంగి శ్రీనివాసరావు, న్యాయవాది మెట్టెల ఆంజనేయులు పాల్గొన్నారు.

స్నేహం చారిటీస్ కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురంలోని ఎస్‌కెవి చిల్డ్రన్స్ ట్రస్ట్‌లో స్నేహం చారిటీస్ వ్యవస్థాపకుడు కొప్పవరపు రవి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ ఎంఎల్ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలు ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), భోగవల్లి శ్రీధర్, వేంపల్లి గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురంలో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పొనుగుపాటి వెంకట సుబ్బయ్య కుటుంబాన్ని ఎంఎల్ఎ సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ వారి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. 40వ డివిజన్ టిడిపి అధ్యక్షులు వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - గంపలగూడెం : నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయంలో జరుగు నిత్యాన్నదానానికి రూ.1,16,000 విరాళం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. తిరువూరు పట్టణ వాస్తవ్యులు నాల వెంకట సత్యనారాయణ రావు సీతాకుమారి కుటుంబ సభ్యులు ఈ నగదును ఆదివారం అందజేశారు. దాతలకు చిత్రపటం అందజేశారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - గంపలగూడెం : 2024- 25 సంవత్సరంలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి (రైతుల) ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు గంపలగూడెం తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమార్ తెలిపారు. ఈ జాబితాలను మండలంలోని అన్ని సచివాలయాల్లో కార్యదర్శులకు వీఆర్వోలు అందజేసినట్లు వివరించారు. (ఎన్ఎస్పి) మేజర్ ఇరిగేషన్‌కు సంబంధించి 82 టిసిలు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 90 టీసీలకు చెందిన అన్ని వివరాలు ఉన్నట్లు చెప్పారు. రైతులకు వచ్చిన అనుమానాలపై నివత్తి కొరకు సంప్రదించాల్సిన సమాచారం కూడా ఆ లిస్టులో పొందుపరిచినట్లు రాజకుమారి వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ విద్యా సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయిన జగ్గయ్యపేట పట్టణంలో జెడ్‌పి బాలుర పాఠశాలకు చెందిన గార్లపాటి చంద్రశేఖర్ (పిఎస్ మాస్టారు)ను ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వారి నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళ్లాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదని అన్నారు. విద్యార్థులకు మంచిగా పాఠాలు చెబితే అవార్డులు అవే వస్తాయని అన్నారు. 30 సంవత్సరాల నుండి సైన్స్ ప్రాజెక్ట్ తయారు చేయడం అభినందనీయని అన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు సైన్స్ కాంప్లెక్స్ సెక్రటరీ జిల్లేపల్లి సదానంద్, ఉపాధ్యాయులు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల శివారులో నందిగామ వైపు వెళ్లే రోడ్డు పక్కన పొలంలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతుండగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నట్లు స్థానిక ఎస్ఐ బి.రాజు తెలిపారు. పట్టుబడిన వారి వద్ద రూ.4,700 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ప్రజాపోరు' కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు : ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 14న జిల్లా మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోడూరులోని పేర్ల సుబ్బారావు ఇండోర్ స్టేడియం వద్ద ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం షాపులు విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగుతున్నాయని, విద్యుత్ చార్జీలు పెంచమని చెబుతూనే ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై కూటమి ప్రభుత్వం 6 వేల కోట్లు భారం వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం సిపిఎంకార్యదర్శి పోలాబత్తిన మోహన్ రావు, మండల కమిటీ సభ్యులు కొప్పనాతి తాతయ్య, పార్టీ నాయకులు బత్తిన రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్** : సిపిఎం ఆధ్వర్యంలో 14వ తేదీన జరిగే ప్రజాపోరులో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు రవీంద్రబాబు ఆదివారం వీరవల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా పోరులు ప్రజలంతా పాల్గొనాలని కోరారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : రాష్ట్రవ్యాప్త సిపిఎం ప్రచారంలో భాగంగా అంగలూరు గ్రామంలోని బీసీ పేటలో కరపత్రాలు పంపిణీ ప్రచారం ఆదివారం నిర్వహించారు. సిపిఎం గుడ్లవల్లేరు మండల భాద్యులు బివిశ్రీనివాసరవు తాళ్లూరి నిర్మల, ధనలక్ష్మి, రాజి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు మండలంలో...


బాపులపాడు మండలంలో..

సమావేశంలో మాట్లాడుతున్న తాతినేని శ్రీహరి

వాకర్స్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆనందంగా జీవించడానికి వ్యాయామం, నడక తోడ్పడతాయని ఏజిఅండ్ఎస్ఎస్ కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరి అన్నారు. కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ సభ్యు లకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు అసోసియేషన్ జిల్లా గవర్నర్ ఎస్ సుబ్బారావు, నూకల సాంబశివరావుతో కలసి బహుతులు అందచేశారు. వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటుచేసుకుని సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్తీక పూజలు చేశారు. కంకిపాడు భజన భక్త బందం మహిళలు, బాలికల కోలాటం, ఇత ర సాంస్కతిక కార్య క్రమాలు అలరించాయి. అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, కార్యద ర్శి పూర్ణచంద్రరావు, చోడవరపు బాపిరాజు, భానుప్రకాశ్, సలీమ్, గఫార్, సీతారామయ్య , మేడిశెట్టిమస్తాన్, ఆంజనేయులు తదితరులు పాల్గొని సేవలందించారు.

ల్యాప్‌టాప్‌లు, వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరు కుని పేరుప్రఖ్యాతులు గడించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. దాతల సహాయంతో ఉన్నత విద్యకై ముగ్గురు విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్, వికలాంగురాలికి వీల్‌చైర్ ఆదివారం తన కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా మాట్లా డుతూ పేద విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌ల అవసరాన్ని స్థానిక పార్టీ నాయకులు బోడెప్రసాద్ దష్టికి తీసుకురాగా ఆయన స్నేహితులు, ముదునూరుకు చెందిన పారిశ్రామిక వేత్త వల్లభనేని తిరుమలరావు, కాటూరుకు చెందిన టీడీపీ నాయకుడు గుర్రం చంద్రశేఖర్ సహకారంతో రూ.1,90,000 విలువైన ల్యాప్ట్యాప్లు, వీల్చైర్ అందచేశారు. సాయిపురంకు చెందిన సాధిక్, చినఓగిరాలకు చెందిన విజయ్‌బాబు. అజయ్ బాబులకు ల్యాప్టాప్లు, గండుగింటకు చెందిన కోన దైవకపకు వీల్చైర్ అందచేశారు. ఉయ్యూరు మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరా వు, క్లస్టర్ ఇన్చార్జ్ కొండా ప్రవీణ్, యూనిట్ ఇన్చార్జ్ సూరపనేని ప్రసాద్, కోయ ఆన ంద్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్, వికలాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

చంద్రశేఖర్‌ని కలిసిన గౌతమ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు, వైఎస్ఆర్సిపి మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం నాయకులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు ను యువ న్యాయవాది, వైసీపీ అభిమాని పడే గౌతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం డాక్టర్ చంద్రశేఖర్ అవనిగడ్డలోని వారి స్వగహానికి రాగా గౌతం ఆయన ఇంటి వద్దకు వెళ్లికలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చంద్రశేఖర్ తో గౌతం చర్చించారు.

పాతికేళ్లుగా ఉచిత వైద్యం

- 2 లక్షల మందికి పైగా రోగులకు సేవలు
- డాక్టర్ సి.ఎల్. వెంకట్రావుకు పలువురు ప్రశంసలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వైద్యో నారాయణో హరి అని పెద్దలు అంటారు. వైద్య రంగంలో దేశ స్థాయిలోనే ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ఖ్యాతి గడించినా... ఆయనకు తప్తి లేదు. పుట్టిన తన సొంత గడ్డకు ఉచిత వైద్య సేవలు చేయాలన్న ఉద్దేశ్యంతో వైద్య శిబిరం కోసం ఒక భవనాన్ని కూడా నిర్మించారు. తనతో పాటు ఎంతోమంది వైద్య రంగంలో హస్తవాసి గల వైద్య నిపుణులను రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చారు. వారితో తమ ప్రాంత ప్రజలకే గాక ఉమ్మడి కష్ణాజిల్లాతో పాటు ఏపీ, తెలంగాణా లోని లక్షలాది మంది రోగులకు తన ఉచిత వైద్య సేవలతో అందరి మన్ననలను పొందారు ఆ డాక్టర్. ఆయనే గుడ్లవల్లేరుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు. ఆయన ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు లో వైద్య శిబిరం 1999లో ప్రారంభమైంది. అప్పట్నించి 25 ఏళ్ల పాటు 2లక్షల మందికి పైగా రోగులకు వివిధ రుగ్మతలకు వైద్య సేవలనుఅందించారు. వందలాది మంది ప్రముఖ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నా డాక్టర్ వెంకట్రావు. పాతికేళ్ల పాటు వైద్య సేవలు అందిస్తున్న ఆయన్ను ఎంతోమంది వందల సార్లు సన్మానించారు.

పాతికేళ్లగా వైద్య సేవలు ఆదర్శనీయం
డాక్టర్ సారథి, డాక్టర్ దాశరథి (కామినేని హాస్పటల్, విజయవాడ)

డాక్టర్ వెంక ట్రావు తమ సొంత గడ్డపై పాతికేళ్లగా వైద్య సేవలు అం దించటం చాలా మందికి ఆద ర్శనీ యంగా మారింది. వైద్య విశ్వవిద్యా లయాలు, కాలే జీలు, హాస్ప టల్స్ నుంచి ఇక్కడికి డాక్టర్లు వస్తున్నారు. అలాంటి మహా యజ్ఞంలో మేము కూడా పాల్గొనటం చాలా ఆన ందంగా ఉంది.

ఏ అనారోగ్యం వచ్చినా ఇక్కడికే వస్తాం : ఎస్.సుజాత, రోగి

ఏ చిన్న అనారోగ్యం వచ్చి నా డాక్టర్ వెంకట్రావు వద్దకే వస్తాం. ఆయనంటే అంత నమ్మకం. మా ఇంట్లో ఒకడిగా వైద్యం చేయటంతో ఆయన హస్త వాసి మాకు దశాబ్దాలుగా నచ్చింది. ఎన్నో హాస్పటల్స్ ఉన్నా ఆయన దగ్గరకే మా ఊరంతా వస్తుంటాం. ఉచి తంగా ఇన్నేళ్లు వైద్యం అందించటం ఎవరికీ సాధ్యం కాదు.

దశాబ్దాలుగా ఉచిత వైద్యం
- ఎ.గాంధీ, రోగి, చిగురుకోట, ముదినేపల్లి మండలం

డాక్టర్ వెంకట్రావు ఉచి తంగా ఎంతమంది వస్తే అంత మంది పేదలకు ఉచిత వైద్యాన్ని పాతికేళ్లగా అందిస్తున్నారు. పేదలకు ఇలాంటి ఉచిత వైద్య అందించే ఇలాంటి డాక్టర్ ని నా జీవితంలో చూడలేదు.

ఉచిత వైద్యంలో పేదలకే ప్రాధాన్యత
డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్

పాతికేళ్ల నా సొంత గడ్డపై అందించిన ఉచిత వైద్య సేవా ప్రస్థానంలో పేదలకు ఎక్కువ ప్రాధాన్యత దక్కింది. పేదలు, మధ్య తరగతి ప్రజలతో ఎక్కువగా తాను మమేకం అవ్వటంతో వైద్యానికి ఇక్కడికే ఎక్కువగా చొరవగా వచ్చి తమ రుగ్మతలకు వైద్య పరిష్కారం పొందుతారు. ఆపదలో ఉన్న వారికి వైద్య సాయం అందించటం అదష్టంగా భావిస్తాను. అందుకే ఇంత కాలం సేవలు అందించాం. అలాగే ఈ పాతికేళ్ల వైద్య సేవా ప్రస్థానంలో ఎంతగానో సహకరించిన వైద్య యూనివర్సిటీలు, మెడికల్ కాలేజీలు, సూపర్ మల్టీ స్పెషాల్టీ హాస్పటల్స్ యాజమాన్యాలు, ఎంతోమంది డాక్టర్లకు కృతజ్ఞతలు.

ప్రభుత్వాల విధానాలపై పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రజలపై వివిధ రకాల భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివీ లక్ష్మణస్వామి అన్నారు. బాపులపాడు మండల సిపిఎం 8వ మహాసభ ఆదివారం హనుమాన్ జంక్షన్‌లో సీతారాం ఏచూరి నగర్‌లో నల్లి ఆంజనేయులు, మహమ్మద్ అబ్దుల్ బారి, కోరం రవి ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా సిపిఎం పతాకాన్ని సిపిఎం సీనియర్ నేత తోట సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం మహాసభ 11 మందిని నూతన కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యదర్శిగా బేతా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజలపై ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ భారాన్ని మోపడానికి సిద్ధపడుతున్న ప్రభుత్వం పై పోరాటం చేయాలని మహాసభ తీర్మానించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా నాయకులు పంచకర్ల రంగారావు, ఉంగుటూరు మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో పెడన నియోజవర్గ శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ ఆదివారం పర్యటించారు.ఈ సందర్భంగా మల్లవోల్లు పరిసర ప్రాంత రైతులు కలిసి తాము పండించిన ధాన్యానికి రైస్ మిల్లర్స్ ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కంటే తక్కువ ధరతో కొంటున్నారని కష్ణ ప్రసాద్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ డీకే బాలాజీతో ఎంఎల్ఏ ఫోన్లో మాట్లాడి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం నుండి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఎమ్మెల్యే కాగితకు హామీ ఇవ్వడంతో రైతులు కతజ్ఞతలు తెలిపారు. పోతన స్వామి, బాసంశెట్టి శ్రీను, కునపరెడ్డిపాండు, మురల నాని,బత్తిన వీరబాబు, బుజ్జి తదితరులు కాగిత వెంట ఉన్నారు.

సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శిగా ఆర్‌సిపి రెడ్డి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శిగా ఆర్‌సిపి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ 13వ మహాసభను కామ్రేడ్ లంకా కాళిదాసు నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణను సీనియర్ కామ్రేడ్ వేశపోగు యెషయ్య ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ లంకా కాళిదాసు చిత్రపటానికి సీనియర్ నాయకులు కె.లక్ష్మణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మహాసభకు జి గోపాలకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి వై నరసింహరావు, జిల్లా కమిటీ సభ్యులు కోసూరి శివ నాగేంద్రలు పాల్గొన్నారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా ఆర్సిపి రెడ్డి, కమిటీ నెంబర్లుగా తమ్మిశెట్టి లక్ష్మణరావు, వి. సుధాకర్ , చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, పి రజినిలు ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా మహాసభకు ప్రతినిధులను ఆరుగురిని ఎన్నుకున్నారు. గుడివాడ పట్టణంలో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, టిడ్కో కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని, అంతేకాకుండా గుడివాడ పట్టణంలో ఉన్న కొత్త కాలనీలో రోడ్లు పరిష్కరించాలని, పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు రేపానికొండ, బి అరుణ, పల్లపు ప్రభుదాసు, పల్లపు వీరమ్మ, ఎల్.సురేంద్ర, ఆలూరి విజయ్ కుమార్, బత్తుల నాగరాజు, మూడెడ్ల నారాయణ, బండి శ్రీను, బోయిన శివకుమారి, బి శ్రీనివాసరావు, టిజి ప్రకాశరావు, కె సురేష్ బాబు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న వై. నరసింహారావు

జగ్గయ్యపేట స్విమ్మర్స్ విజయదుందుభి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదివారం రాజమహేంద్రవరం మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 7వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్స్ పోటీలలో జగ్గయ్యపేట స్విమ్మర్స్ విజయందుందుభి మోగించారు. పలు విభాగాల్లో మొత్తం 82 పతకాలు సాధించి ఆల్ టైమ్ రికార్డ్ సృష్టించారు. రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలల్లో ఎన్.టి.ఆర్ జిల్లా జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ నుండి 11 మంది మహిళలు,11 మంది పురుషులు మొత్తం 22 మందితో కూడిన జట్టు స్విమ్మర్లు పాల్గొన్నారు.

గంజి మోహన్ బాబు 70+ పసిడి 3, రజితం- 1, కాస్తల ఏసుమణి 60+ పసిడి పతకాలు -4, పొట్టాబత్తిన లక్ష్మి 55+ పసిడి పతకాలు- 4, యన్నాకుల రాంబాబు 55+ పసిడి 1, రజిత 1 కాంస్యం 1, యన్నాకుల ఉషారాణి 50+ పసిడి -3, రజిత-1, ఏనుగుల సీతారామమ్మ 50+ పసిడి-4, యలగందుల భవాని 50+ పసిడి-1 రజితం-2, కాంస్యం-1, పరిణం రమాదేవి 45+ పసిడి-2, రజితం-2, కూరపాటి సరితా దేవి 40+ పసిడి-4, తుమ్మడపు నాగమణి 40+ పసిడి-4, కటికల జయ పావని 40+ పసిడి -2, అడ్డగోట్టు సౌజన్య 35+ పసిడి -2, రాయపూడి నిహారిక 30+ పసిడి-4, ఎస్ కె. బి ఎస్ వర్మ 60+ పసిడి- 3, కాంస్యం -1, ఎస్ ఎస్ వర్మ 55+ పసిడి-1, కాంస్యం-2, రజితం-1, కొండూరు యలమందరావు 45+ పసిడి-1, రజిత -1, కాంస్యం -2, కూచిపూడి శ్రీనివాసరావు 40+ పసిడి -1, కాంస్యం-2, అడ్డగోట్టం రమేష్ బాబు 40+ పసిడి-2, రజితం -2, యంద్రాతి రామారావు 35+ పసిడి -2, కాంస్యం-2, గోపనబోయిన శ్రీనివాసరావు 35+ పసిడి-3, రజితం -1, పొట్టాబత్తిన సందీప్ 35+ పసిడి -2, రజితం -2, పొట్టబత్తిన పాండురంగారావు పసిడి-2 పథకాలు సాధించారు. కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగ రావు, లక్ష్మి ఆధ్వర్యంలో టీం మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్ సారథ్యం వహించారు. స్విమ్మర్స్ అందరికీ జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ రాజగోపాల్ (తాతయ్య), మాజీ శాసనసభ్యులు సామినేని ఉదయభాను, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, డా.సామినేని దీపక్ కుమార్, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మందడపు శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కలలి నరేష్, కో కన్వీనర్ శ్రీయలదండి శ్రీనివాసరావు, కృష్ణా స్విమర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డి.ఎస్.పి. మోటపోతుల కిషోర్ బాబు, అధ్యక్షులు కె.కరుణాకర్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు రాటకొండ శ్రీనివాస్, చెరుకూరి రమేష్, గోగిశెట్టి మహేష్, సీనియర్ స్విమ్మర్ కొల్లి మార్షల్ స్టాలిన్, అల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన స్విమ్మర్స్

సెమీ ఫైనల్‌కు హ్యాండ్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ పడమట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న అండర్ 17 బాలికల హ్యాండ్ బాల్ పోటీలు ఆదివారం సాయింత్రానికి ఫలితాలు ఇలా ఉన్నాయి. తొలి క్వార్టర్ ఫైనల్‌లో శ్రీకాకుళం జట్టు కడప జట్టుతో తలపడగా 10 -04 తేడాతో శ్రీకాకుళం గెలుపొందింది. రెండవ క్వార్టర్ ఫైనల్‌లో విజయనగరం జట్టు అనంతపురం జట్టుతో తలపడగా10 -02 తేడాతో విజయనగరం జట్టు గెలుపొందింది. మూడో క్వార్టర్ ఫైనల్‌లో కృష్ణా జట్టు 12 -01 తేడాతో గుంటూరుపై గెలుపొందింది. నాలుగవ క్వార్టర్ ఫైనల్‌లో ప్రకాశం జట్టు పశ్చిమ గోదావరి జట్టుతో తలపడి 06 -04 తేడాతో గెలుపొందింది. శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, ప్రకాశం జట్లు సెమిఫైనల్‌కు చేరుకున్నట్లు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్.దుర్గారావు తెలిపారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధ ప్రసాద్

'ఆర్ట్ ఆఫ్ ఎపి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కళాకారుల వివరాలతో రూపొందించిన 'ఆర్ట్ ఆఫ్ ఎపి' పుస్తకం ఎంతో అమూల్యమైనదని ఎంఎల్‌ఎ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆదివారం విజయవాడ భవానీపురంలోని హరిత బెరమ్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ ఎపి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కళారంగానికి పెద్దపీట వేస్తూ వచ్చిన ఈ పుస్తకం రూపొందించిన 64 కళలు.కామ్ ఎడిటర్ యల్లపు కళాసాగర్ అభినందనీయులని ప్రశంసించారు. కళారంగానికి సంబంధించిన దాదాపు 300 మంది ప్రముఖుల గురించి ఈ పుస్తకం ద్వారా లోకానికి చాటిచెప్పినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కళాకారులు, దిగ్గజ కవుల గురించి వివరిస్తూ అద్భుతంగా రూపొందించిన 'కైమోడ్పులివే కళల లోగిళ్లకు' ప్రత్యేక వీడియో చిత్ర గీతాన్ని బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ పాట రచయిత గంటాడ గౌరి నాయుడును సభాముఖంగా ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో 64కళలు.కామ్ స్ఫటిక జయంతి సంచికను పద్మశ్రీ అవార్డు గ్రహీత సివి.రాజు ఆవిష్కరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీతశిల్పి డాక్టర్ బొండా జగన్మోహనరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఆంధ్రా యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ వి.రమేష్ పాల్గొన్నారు.

టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టాటా ఇండియా సంస్థ ఇన్నోవేషన్ ఫండ్ అవిష్కరించినట్లు సంస్థ ఇన్చార్జి ఎస్.ప్రకాష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. వివిధ రంగాల్లో వినూత్న వ్యూహాలు, థీమ్‌లను అమలు చేస్తూ ప్రయోజనం పొందే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక మూలధన వృద్ధి అవకాశాలను అందించే లక్ష్యంతో ఈ ఫండ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్‌ఎఫ్‌ఎ (న్యూ ఫండ్ ఆఫర్) 2024 నవంబర్ 11న సబ్ స్క్రిప్షన్ కోసం ప్రారంభమవుతుందని తెలిపారు. ఇతర వివరాలకు దగ్గరలోని టాటా సంస్థలో సంప్రదించవచ్చని తెలిపారు.

బాల్య శుక్లంపై అవగాహనా నడక

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : బాలల నేత్ర సంరక్షణా వారం పురస్కరించుకొని బాలల్లో కంటి వ్యాధులు, బాల్య శుక్లం వ్యాధులపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఎల్‌విపిఇఐ ఆధ్వర్యంలో నేత్ర సంరక్ష అవగాహనా నడక కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం విజయవాడలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడి వెంకటాద్రి చౌదరి ప్రాంగణంలోని నడక కార్యక్రమాన్ని పెనమలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విజయవాడ ఎల్‌విపిఇఐ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కృష్ణప్రియ ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లల్లో అనేక కంటి వ్యాధులపట్ల సామాజిక అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థ అంతటా బాలల నేత్ర సంరక్షణ అవగాహనా వారం నిర్వహిస్తుందన్నారు. ఈ సంవత్సరం దీనిని వ్యవస్థ అంతటా నవంబర్ 7 నుంచి 14 వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌విపిఇఐ అన్ని చోట్లా చిత్రలేఖనం, ఫ్యాన్సీడ్రెస్, వక్తృత్వం, క్లే మోడలింగ్, బ్రెయిలీ చదవడం, పాటరీ సెషన్లు తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం 'బాల్య శుక్లం' అంశంపై ప్రధానంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాల్య శుక్లాలు, పిల్లల చూపుపై వాటి ప్రభావం, త్వరిత గుర్తింపు, చికిత్స ప్రాధాన్యతపట్ల అవగాహన పెంచడం సత్వర వైద్య సలహా పొందడానికి తల్లితండ్రులను ప్రోత్సహించడం ఈ నడక లక్ష్యం అన్నారు. బాలలు, వారి తల్లిదండ్రులు ప్లకార్డులు చేతబట్టి నడకలో పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

ప్రజాశక్తి - మైలవరం : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అప్స డెమొక్రటిక్ మైలవరం నియోజకవర్గ స్థాయి ప్రయివేట్ పాఠశాలల బాలబాలికల ఆటల పోటీలు ఆదివారం స్థానిక గౌతమ్ స్కూల్లో ముగిశాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అప్స డెమొక్రటిక్ వ్యవస్థాపకులు గొల్లపూడి మోహన్‌రావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమేనన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ సెక్రటరీ గొల్లపూడి సురేష్, పలు పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, కరస్పాండెంట్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యానవనం సందర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పటమట ప్రాంతంలోని 10వ డివిజన్ గల అక్కినేని పూర్ణచంద్రరావు నగరపాలక సంస్థ ఉద్యానవనాన్ని ఎంపి కేశినేని శివనాథ్ సందర్శించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ ఆ ఉద్యానవనంలో ఆగిపోయిన పనులు, కావాల్సిన సుదుపాయాలు ఎంపి కేశినేని శివనాథ్‌కి వివరించారు. ఉద్యాన వనంలో వున్న కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. ఉద్యానవనంలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ కోర్ట్ ఏర్పాటు చేయటంతో పాటు చక్కటి సదుపాయాలు ఉండేలా అభివృద్ధి జరిపిస్తామన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసిస్టెంట్ టౌన్ ప్లానర్ మోహన్‌బాబు, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ వసీం బేగ్, మారుతీ కో-ఆపరేటివ్ కాలనీ ప్రెసిడెంట్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర రవాణా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఇటీవల నియమితులైన తిరుమల తిరుమతి దేవస్థానం బోర్డు సభ్యులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. టిటిడి సభ్యురాలు ఆర్.ఎన్.దర్శన్, తమ్మిశెట్టి జానకీదేవి దంపతులు, మరో సభ్యులు అనుగోలు రంగశ్రీ దంపతులు దుర్గమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శ నం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై చర్యలు శూన్యం

ప్రజాశక్తి - గంపలగూడెం: దశాబ్దాలుగా ఆ సరస్వతీ నిలయానికి చెందిన భూమిని అక్రమార్కులు ఆక్రమిస్తే అధికారులు చేపట్టిన చర్యలకు ఫలితం శూన్యం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ఉమ్మడి జిల్లా స్థాయిలో వెలుగొందుతున్న శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం ఉన్న నెమలి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి సంబంధించిన అంశం. వివరాల్లోకపోతే ఆ పాఠశాల ప్రాంగణం 5.41 సెంట్లుగా, గతంలో రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు. దశాబ్దాల కాలంగా, ఆ స్థలాన్ని కొందరు పక్కా నిర్మాణాలు చేపట్టి వారి ఆధీనంలో కొనసాగుతుంటే అధికారులు చూస్తూ ఊరుకుండి పోయారు. కొంతకాలానికి గ్రామస్తులే ఫిర్యాదులు చేయగా, అప్పుడు గత ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఆర్‌డిఒ స్థాయిలో పరిశీలన చేసి, ఆక్రమణలు ఏ స్థాయిలో జరిగాయి అన్న పరిశీలనలో 41 సెంట్ల భూమి అన్యాక్రాంతమైనట్లు గుర్తించారు. ఈ విషయమై అడ్డగోలుగా ఆక్రమించుకున్న 41 సెంట్లు భూమిని వదిలేస్తారా అంటూ గ్రామస్తులు ఆగ్రహించారు. తదుపరి ఆ స్థలానికి సరిహద్దులు సైతం నిర్ధారించి, వెంటనే ఖాళీ చేయాలని సదరు ఆక్రమణదారులకు ఆదేశాలిచ్చారు. అయినా అక్రమార్కులకు చీమకుట్టినట్టైనా లేదని ప్రజలు పేర్కొంటున్నారు. పాఠశాలకు చెందిన ఆ స్థలాన్ని ఇతరులు ఆక్రమించడం సరైన పద్ధతి కాదంటూ, ప్రజలతో పాటు అధికారుల సైతం చెప్పకనే చెబుతున్నారు. అధికారులు అన్ని అవకాశాలు తమ చేతుల్లో ఉన్నా ఆక్రమణలను వేకేట్ చేయించడం చేతకాక పోవడం శోచనీయమన్నారు. ఒక సందర్భంలో అప్పటి నూజివీడు ఆర్‌డిఒ, తహాశీల్దార్, మండల సర్వే సిబ్బంది ఆ ఆక్రమణలపై యుద్ధం ప్రకటించారు. కానీ ఫలితాన్ని పొందలేకపోవడం దురదృష్టకరం. అంతేకాదు పాఠశాల ప్రాంగణం దారి పొడవున పెద్ద కుప్పలు వేసి కొందరు ఆక్రమించడంతో నాలుగు చినుకులు పడితే చాలు విద్యార్థులు ఉపాధ్యాయులు క్లాస్ రూములు కూర్చునే స్థితి లేకుండా దుర్వాసన వెదజల్లుతోంది. ఒక్కో సందర్భంలో వాంతులు చేసుకున్న పరిస్థితులు ఉన్నట్లు చెబుతున్నారు. నూతనంగా వచ్చిన తహాశీల్దార్ సైతం ఈ విషయమై వినతిపత్రం సమర్పించినట్లు తెలిసింది. ఇప్పటికైనా మరోసారి ప్రభుత్వం అధికారులు ఈ విషయమై స్పందించి, పాఠశాల స్థలాన్ని పాఠశాల యాజమాన్యానికి అప్పగించాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆక్రమణకు గురైన స్థలం

అమలు కాని ఎంఎల్‌ఎ హామీ

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ రెండు నెలల తరువాత తిరువూరు ఎంఎల్‌ఎ కె.శ్రీనివాస్ సాక్షాత్తు నెమలి గ్రామ పర్యటనలో భాగంగా, ఆ పాఠశాల పరిస్థితులను సందర్శించి పరిశీలించారు. వెంటనే ఆక్రమణ తొలగించి, పాఠశాల ప్రాంగణానికి ప్రహరీ గోడను నిర్మిస్తామని అందరి సమక్షంలో చెప్పారు. కానీ అది నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజల నుండి ఎంఎల్‌ఎ విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ అంశంపై ఆ పాఠశాల హెచ్ఎం డి.చంద్రంను ఆరాతీయగా పైన పేర్కొన్న అంశాలు వాస్తవమేనని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.